## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



పాఠకులకు, ప్రకటన కర్తలకు, వ్యాపార వాణిజ్యవేత్తలకు, అధికారులకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, మహిళామణులకు ప్రతి ఒక్కరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు.. పండుగ సందర్భంగా శనివారం కార్యాలయానికి సెలవు. పున: దర్శనం సోమవారం.

- వరంగల్ వాయిస్ యాజమాన్యం



# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 277
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
ఆగస్టు 08, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




వివరాలు 2లో..

# అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ కానుక





- 592 డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీ
- గృహ ప్రవేశాలు చేయించిన నేతలు
- ముఖ్యఅతిథిగా హాజరైన ఇంచార్జి మంత్రి పొంగులేటి
- కాళోజీ కళాక్షేత్రంలో అట్టహాసంగా సాగిన కార్యక్రమం
- కేసీఆర్ కాసుల కక్కుర్తితోనే కాళేశ్వరం కూలిందన్న మంత్రి

పేదలకు ఆరేళ్లకుపైగా డబుల్ బెడ్ రూమ్ ల ఆశ చూపి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరినీ నిండా ముంచిందని, నిరుపేదల నుంచి పెద్ద మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఇవే ఇండ్లను చూపించి రెండో సారి కూడా అధికారంలోకి వచ్చినా ఏ ఒక్కరికీ పట్టాలివ్వలేదని విమర్శించారు. మూడోసారి కూడా మోసం చేస్తే ప్రజలు కర్రు కాచి వాతలు పెట్టారన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రం అంబేద్కర్ నగర్ లోని 592 రెండు పడక గదుల ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఇంచార్జి మంత్రి చేతుల మీదుగా అట్టహాసంగా నిర్వహించారు. రాఖీ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న కానుక అంటూ మంత్రి అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డితోపాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు పాల్గొన్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ



8లో..

## అన్నీ తానై..

- 40 ఏళ్ల కల నెరవేర్చిన నాయిని
- ప్రశంసలు కురిపిస్తున్న లబ్ధిదారులు



8లో..

## మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి

- మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఆర్పీలకు మొక్కల అందజేత


## దశదినకర్మ



స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం॥ర శ్రావణ శుక్ల సప్తమి
తేది: 31-07-2025 గురువారము రాత్రి 10.42 లకు
మా తండ్రి గారైన

**కీ:శే: మార్త భద్రయ్య గారు**

స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది: 10-08-2025 ఆదివారం ఉదయం10.00లకు
దశదినకర్మ పుణ్యాహవచనం, మహదాశీర్వచనము
జరుపబడును. కావున తామెల్లరు సకాలమునకు విచ్చేసి,
మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

కార్యస్థలము :
మా స్వగృహము
గ్రా॥ ఎలుకుర్తి (హ), మం॥ గీసుగొండ.
జి॥ వరంగల్. సెల్: 9676022262

సహపంక్తి భోజనము :
మధ్యాహ్నం 12-30 గం.లకు

ఇట్లు
**కుటుంబ సభ్యులు**




# అక్కాచెల్లెళ్లకు.. రాఖీ పండుగ కానుక



- 592 డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీ
- గృహ ప్రవేశాలు చేయించిన నేతలు
- ముఖ్యఅతిథిగా హాజరైన ఇంచార్జి మంత్రి పొంగులేటి
- కాళోజీ కళాక్షేత్రంలో అట్టహాసంగా సాగిన కార్యక్రమం
- కేసీఆర్ కాసుల కక్కుర్తితోనే కాళేశ్వరం కూలిందన్న మంత్రి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణ పేదలకు దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోని నిరుపేదలకు 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామన్నారు. పట్టణ పరిధిలోని మురికివాడల్లో నివసిస్తున్న పేదలకు అవసరమైతే మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాంటి ప్రాంతాల్లో జాబితా తయారీపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని సూచించారు. హనుమకొండ జిల్లా బాల సముద్రం ప్రాంతంలో రూ.3,904 లక్షల వ్యయంతో జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మించిన 592 ఇండ్లకు సంబంధించిన శిలాఫలకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను అందజేసిన మంత్రి పొంగులేటి దగ్గరుండి గృహ ప్రవేశాలు చేయించారు. కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం రాండమైజేషన్ పద్ధతి ద్వారా ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించారు.

## రాఖీ పండుగ కానుక..

గ్రామీణ ప్రాంతాల ప్రజలకే కాకుండా పట్టణ పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పునరుద్ఘాటించారు. శ్రావణ మాసం శుక్రవారం రోజున 592 మంది గృహ ప్రవేశాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. రాఖీ పండుగకు ఒక రోజు ముందుగానే పండుగ కానుకగా అక్కాచెల్లెళ్లకు సొంతింటి కల సాకారం చేశామన్నారు. ఈ ఇండ్లు మహిళల పేరిటే మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ ప్రభుత్వం పేదల పక్షపాతిగా సంక్షేమం–అభివృద్ధి ప్రాతిపదికన ముందుకు సాగుతోందని ప్రకటించారు. తాజాగా ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు కాగా, ఇప్పటికే దశల వారీగా ఆరు హామీలను అమలు చేస్తున్న విషయం ప్రజలు గుర్తించాలని మంత్రి కోరారు. పార్టీలకు అతీతంగా ఎంతో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేశారని దుయ్యబట్టారు. గతంలో కట్టిన ఈ ఇండ్లను ఎందరో పేదలకు చూపించి అడ్డగోలుగా బీఆర్ఎస్ నేతలు వసూళ్లు చేసి ఎవరికీ ఒక్క ఇంటిని ఇవ్వలేదని ఆరోపించారు. అంతేగాక ఈ ఇండ్ల ఆశను చూపి ప్రతిసారి ఎన్నికల్లో లబ్ధిపొందారని అయితే మూడో సారి వారి మోసాన్ని గమనించి పేదలు తగు బుద్ధి చెప్పారని అన్నారు.

## కమీషన్ల కోసమే..

తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడిచేలా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్లకోసం కక్కుర్తి పడిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. వారి అవినీతి కారణంగానే కట్టిన కొన్నేళ్లకే కాళేశ్వరం కూలిందన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వేల కోట్ల రూపాయిలు కేసీఆర్ కుటుంబానికి లబ్ధి చూకూరిందని విమర్శించారు. దోచుకున్నది దాచుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు అధికార ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారని విమర్శించారు. కాగా దేశంలో బీసీ కులగణన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, 42 శాతం బీసీ కోటా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు, ఇతర సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.
















# భారతదేశంపై అమెరికా సుంకాలను నిరసించండి



● సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

**వరంగల్ వాయిస్, వరంగల్:** అమెరికా ప్రభుత్వం భారతదేశం నుండి దిగుమతులపై 50% సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఈ నెల 13న వరంగల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్కేఎం జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఇది నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన 83వ క్విట్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా జరుగుతుందని వారు తెలిపారు. అబ్బని కుంటలోని తెలంగాణ రైతు సంఘం భవన్‌లో నాయకులు ఓదెల రాజయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా రైతు సంఘాల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశం నుండైనా అతి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే హక్కు భారత్‌కు ఉందని, అమెరికా దీన్ని గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాతో ద్వైపాక్షిక చర్చలు జరిపి ట్రంప్ ప్రభుత్వానికి లొంగిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టుపెట్టే విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశంలోని వ్యవసాయ రంగంలో అమెరికా బహుళజాతి కంపెనీలు వ్యాపారం చేయడానికి ఒప్పందాలు చేసుకోవాలని ట్రంప్ ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని, దీనివల్ల రైతులు తమ హక్కులను కోల్పోతారని, ఆర్థిక భద్రత ఉండదని వారు హెచ్చరించారు. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణానికి అమెరికాయే కారణమని ఆరోపించారు. సామ్రాజ్యవాద అమెరికా ప్రభుత్వ ఆర్థిక దిగ్బంధనాన్ని వ్యతిరేకిస్తూ జరిగే ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని నాయకులు ప్రజలను కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు వల్లందాస్ కుమార్, ఐత నగేష్, జక్కుల తిరుపతి, ఇనుముల కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం శోభ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా వరలక్ష్మి పండుగ, రాఖీ పౌర్ణమి నేపథ్యంలో ప్రజలు అధిక సంఖ్యలో ఆలయాలను సందర్శించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లగిశెట్టి బాలమణి భిక్షపతి దంపతులు వరలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని లగిశెట్టి భిక్షపతి తెలిపారు. రాఖీ పౌర్ణమి రోజున సాంప్రదాయ దుస్తులలో ఆలయానికి రావాలని ఆయన భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాదేవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ళ ఉపేందర్–రేణుక దంపతులు, లగిశెట్టి లింగయ్య దంపతులు, గందె వీరయ్య, గందె రవి, పోకల పోషనాథం, మహాదేవ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పిండిప్రోలు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై కల్వర్టు మరమ్మత్తులు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై రఘునాథపల్లి మండల కేంద్రంలో కల్వర్టు మూసుకుపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, దీనికి మరమ్మత్తులు చేపట్టారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం, జనగామ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఏడవెల్లి శ్రీనివాస్ రెడ్డి జేసీబీ సహాయంతో కల్వర్టు మరమ్మత్తులను వేగవంతం చేశారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ పనులను ముందస్తు చర్యగా చేపట్టినట్లు సీఐ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతూ గ్రామం నుంచి వచ్చే నీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల ఏటా ఈ కల్వర్టు వద్ద నీరు నిలిచిపోతుందని, జాతీయ రహదారికి అంతరాయం కలుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున, పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి సబ్ ఇన్స్పెక్టర్ దూదిమెట్ల నరేష్ యాదవ్, స్థానిక కార్యదర్శి బాలు, కారోబార్ అజ్మత్, మాజీ వార్డు మెంబర్ కడారి చిన్న నాగేష్, శతారాశి నరేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ శ్యామ్ సుందర్‌కు ఉత్కృష్ట సేవ పతకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవ పతకం వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కల్లూరి శ్యామ్ సుందర్‌కు లభించింది. ఈ సందర్భంగా, పోలీస్ ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పలువురు శ్యామ్ సుందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఆయన అంకితభావం, విశిష్ట సేవలకు దక్కిన గౌరవం.

# విద్యార్థులకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆజం జాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో, పోలీస్ జాగృతి కళా బృందం మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బొల్లం రమేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్, పోలీస్ జాగృతి కళా బృందం సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై సీపీఎం నిరసన




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీహార్‌లో బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జి. నాగయ్య పాల్గొన్నారు. కామ్రేడ్ జి. నాగయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అండదండలతో బీజేపీ, "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)" పేరుతో ఓటర్ల ప్రత్యేక సవరణ నిర్వహిస్తోందని విమర్శించారు. దీని ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియలో అత్యధికంగా మైనారిటీలు, ప్రతిపక్షాలకు చెందిన సుమారు 64 లక్షల ఓట్లను ఎన్నికల కమిషన్ తొలగించిందని ఆయన తెలిపారు. ఎస్సీ నియోజకవర్గాలలో దాదాపు 40 నుంచి 60 శాతం ఓట్లను తొలగించారని నాగయ్య అన్నారు. అధికారంలోకి రావడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని, ప్రజాస్వామ్యవాదులందరూ దీనిని ఖండించి బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్. రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, ఆరూరి కుమార్, బషీర్, వలదాసు దుర్గయ్య, యారా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌కు మద్దతుగా యాత్ర



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** హైదరాబాద్‌లో సిట్ విచారణకు హాజరవుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్‌కు మద్దతుగా నర్సంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు బయలుదేరారు. బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి బయలుదేరారు. కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బండి సంజయ్ సిట్ ముందు ఆధారాలు సమర్పించనున్న సందర్భంగా ఈ మద్దతు యాత్ర జరిగింది.

# పవిత్రతకు చిహ్నమే రక్షా బంధన్

◆ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాఖీ వారోత్సవాలు

**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ జిల్లాలో బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో రాఖీ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజయోగిని బి.కె. నిర్మల మాట్లాడుతూ, రాఖీ పండుగ ఆత్మీయత, అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. రాఖీ పండుగ అర్థం: రాఖీ అనేది సోదరి తన సోదరుడి క్షేమం కోరుకోవడం, అలాగే తాను కూడా క్షేమంగా ఉండాలని ఆశించడం అని ఆమె వివరించారు. ప్రస్తుతం ఎవరికి వారు తమను తాము దురలవాట్ల నుండి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, పవిత్రమైన యోగి జీవితం గడిపేవారినే పరమాత్ముడు రక్షిస్తారని ఆమె అన్నారు. గత వారం రోజులుగా రాఖీ వారోత్సవాలు నిర్వహించామని, ఈ సందర్భంగా జనగామ జిల్లా జాయింట్ కలెక్టర్ పింకేశ్ కుమార్, ఆర్డీఓ గోపి, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఎమ్మార్వో హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులకు రాఖీలు కట్టామని ఆమె తెలిపారు. రాఖీ కట్టినప్పుడు డబ్బులు అడగకుండా, చెడు అలవాట్లను మానుకుంటామని ప్రతిజ్ఞ చేసిన వారికే రాఖీలు కడతామని నిర్మల చెప్పారు. స్వయం నియంత్రణ, మంచి ప్రవర్తన ఉన్నప్పుడే పూర్తి రక్షణ






లభిస్తుందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో, దివ్య గుణాలతో, మంచి సంస్కారాలతో జీవించడానికి రాజయోగాన్ని అభ్యసించాలని, మెడిటేషన్ చేయాలని ఆమె సూచించారు. పండుగ రోజు స్వీట్లు తినడం అంటే ప్రతి ఒక్కరు మధురంగా మాట్లాడాలని గుర్తుచేస్తుందని, మాటలను అదుపులో ఉంచుకోవడం వల్ల మనశ్శాంతి లభిస్తుందని, దీనికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్: మెడిటేషన్ ప్రతి ఒక్కరికీ అవసరమని, బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. బ్రహ్మకుమారీల సేవలను తాను చాలా కాలం నుండి గమనిస్తున్నానని, వారు నేర్పించే మెడిటేషన్ ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సంకల్పం చేసుకోవడమే నిజమైన రాఖీ పండుగ రహస్యం అని ఆయన అన్నారు. రాజయోగ మెడిటేషన్‌ను కేవలం ఏడు గంటల్లో ఉచితంగా నేర్చుకోవచ్చని, ఆసక్తి ఉన్నవారు 9849865474 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాజయోగిని బి.కె. మోహిని, బీకే విద్యార్థులు దివాకర్ శ్యామ్, రామిని సత్యనారాయణ, ప్రిన్సిపల్ అనిల్ కుమార్, డాక్టర్ చారి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు

■ పాత వంతెన దెబ్బతినడంతో చర్యలు

**వరంగల్ వాయిస్, ములుగు:** ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జాతీయ రహదారి–163పై మల్లంపల్లి, జాకారం మధ్య ఉన్న ఎస్ఆర్ఎస్పీ కాలువపై గల పాత వంతెన దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేషనల్ హైవే అధికారులు తక్షణమే తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయ్యే వరకు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ప్రయాణికులు పోలీసులకు సహకరించి, సూచించిన మార్గాలను అనుసరించాలని అధికారులు కోరారు. ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు 1.వరంగల్ నుంచి ములుగు వైపు ప్రయాణించే భారీ వాహనాలు (లారీలు, డీసీఎంలు) గూడెప్పాడు → పరకాల → రేగొండ → జంగాలపల్లి మార్గంలో ప్రయాణించాలని, తిరుగు ప్రయాణం: జంగాలపల్లి → రేగొండ → పరకాల → గూడెప్పాడు మార్గంలో వరంగల్‌కు వెళ్లాలన్నారు. 2. వరంగల్ నుండి ములుగు/ ఏటూరునాగారం వైపు ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, కార్లు (ఎల్ఎంవీ), టూ వీలర్లు వెళ్లే మార్గం: మల్లంపల్లి వద్ద డైవర్షన్ తీసుకొని → శ్రీనగర్ → పందికుంట → ములుగు వైపు ప్రయాణించగలరు. తిరుగు ప్రయాణం: జాకారం → అబ్బాపూర్ → గోరుకొత్తపల్లి మార్గంలో వరంగల్‌కు వెళ్లాలి. 3. నర్సంపేట నుంచి ములుగు వైపు ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, కార్లు వెళ్లే మార్గం: మల్లంపల్లి → శ్రీనగర్ → పందికుంట మార్గంలో ప్రయాణించగలరు. తిరుగు ప్రయాణం: పందికుంట → శ్రీనగర్ → మల్లంపల్లి మార్గంలో నర్సంపేటకు వెళ్లగలరు. 4. నర్సంపేట నుండి ములుగు వైపు ప్రయాణించే భారీ వాహనాలు (లారీలు, డీసీఎంలు) వెళ్లే మార్గం: వరంగల్ → గూడెప్పాడు → పరకాల → రేగొండ → జంగాలపల్లి మార్గంలో ప్రయాణించగలరు. తిరుగు ప్రయాణం: జంగాలపల్లి → రేగొండ → పరకాల → గూడెప్పాడు → వరంగల్ మార్గంలో నర్సంపేటకు వెళ్లగలరు. ఆర్టీసీ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా, వారి కోసం మల్లంపల్లి → శ్రీనగర్ → పందికుంట గ్రామాల ద్వారా ప్రత్యేకంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ మార్గంలో భారీ వాహనాలను అనుమతించడం లేదు.

# కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోంది

◆ సిరికొండ మధుసూదనాచారి

**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** బీసీలకు రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, తన అసమర్థతను నిరూపించుకున్నారని విమర్శించారు. ఆగస్టు 5, 6 తేదీలలో బీసీ అంశంపై ఢిల్లీలో భూకంపం సృష్టిస్తామని రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ, అక్కడ కేసీఆర్, బీఆర్ఎస్‌లను విమర్శించి తన డొల్లతనాన్ని బయటపెట్టుకున్నారని అన్నారు. ఇప్పుడు మెజారిటీ సంఖ్యలో ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ సాధించలేకపోవడం ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేకపోవడానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో సోనియా గాంధీని 'బలి దేవత' అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు మాట మార్చడం ఆయన విధానానికి నిదర్శనమని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బీసీల ద్రోహి పార్టీగా గుర్తించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రజలను మరోసారి మోసం చేసిందని అన్నారు. ఎన్నికల ముందు బీసీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను తీసుకొచ్చి హామీలు ఇచ్చారని, కానీ ఆ హామీలన్నీ ఇప్పుడు మోసాలుగా మారాయని ఆరోపించారు. బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, కేవలం రూ. 7 వేల కోట్లు, రూ. 10




వేల కోట్లే కేటాయించారని విమర్శించారు. బీసీలకు అన్ని రంగాల్లో 42శాతం అవకాశాలు కల్పిస్తామని చెప్పి, వేల కోట్ల కాంట్రాక్టులను మంత్రి శ్రీనివాస్ రెడ్డి, మెగా కృష్ణారెడ్డికి ఇచ్చారని, బీసీ కాంట్రాక్టర్లకు ఇవ్వలేదని ఆరోపించారు. త్వరలో వరంగల్, కాకతీయ యూనివర్సిటీ వేదికగా బీసీ హక్కుల కోసం పోరాటాలకు శ్రీకారం చుడతామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. అలాగే, ఆగస్టు 14న కరీంనగర్‌లో బీసీల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ చైర్మన్ చింతం సదానందం, నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నాయీముద్దీన్, శోభన్, జానకిరాములు, విజయ్ రెడ్డి, ఖలీల్, రాజు యాదవ్, వినీల్ రావు, రాజ్ కుమార్, శ్రీధర్,ఆదిత్య పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలకు 'పెద్ది' పరామర్శ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, చెన్నారావుపేట మండలంలోని పలు బీఆర్ఎస్ పార్టీ కుటుంబాలను పరామర్శించారు. ఈర్య తండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్త భూక్య రాజు తండ్రి భూక్య బావుసింగ్ మరణించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఇదే గ్రామానికి చెందిన అంగోతు జంపయ్య తండ్రి అంగోతు బిక్య మరణించిన విషయాన్ని తెలుసుకుని, వారి కుటుంబాన్ని కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన పిట్టల అనిల్ తండ్రి పిట్టల ఉప్పలయ్య అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న, మండల అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్ కుమార్, అమ్మ రాజేష్, కార్యదర్శి సాదు నర్సింగరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా రాఖీ వేడుకలు



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్:** వరంగల్‌లోని రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు, విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. అనంతరం అందరూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని, రాఖీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ రాఖీ పండుగ హిందువుల ముఖ్య పండుగలలో ఒకటని అన్నారు. "రాఖీ అంటే రక్షణ బంధం అని అర్థం. ఈ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమకు ప్రతీక. సోదరీమణులు తమ సోదరుల విజయాల కోసం కోరుకుంటూ రాఖీ కడతారు, అందుకు ప్రతిగా సోదరులు తమ సోదరికి జీవితాంతం రక్షణగా ఉంటామని వాగ్దానం చేస్తారు" అని ఆయన వివరించారు. విద్యార్థులు కూడా పాఠశాలలో సోదరభావంతో ఒకరికొకరు రక్షణగా ఉంటూ, మంచి వాతావరణంలో చదువుకోవాలని నర్సయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం గణపురం మండలంలోని బుద్ధారం గ్రామంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలోని గోశాలను సందర్శించి, గోవులకు పండ్లు, ఆకుకూరలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గోపూజ మన సంప్రదాయంలో అత్యంత ముఖ్యమైనది. గోవులను కాపాడటం మనందరి బాధ్యత" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ ప్రజలు, పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల వాటా బీసీలకే దక్కాలి

◆ తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్:** బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు, దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని వామపక్ష నాయకులు ప్రతిజ్ఞ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ దేశంలో సంపదను సృష్టిస్తున్నది బహుజనులేనని, కానీ రాజ్యాధికారంలో అగ్రవర్ణాలదే ఆధిపత్యమని అన్నారు. 1953, 1979లో కాకా కాలేల్కర్, బీపీ మండల్ కమిషన్లు బీసీల కుల గణన చేపట్టాలని సూచించినప్పటికీ, అప్పటి ప్రభుత్వాలు వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. 1992లో వీపీ సింగ్ ప్రభుత్వం 27% ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించగా, బీజేపీ, కాంగ్రెస్ వంటి పార్టీలు దీనిని వ్యతిరేకించి సుప్రీంకోర్టులో కేసు వేశాయని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు 50శాతం రిజర్వేషన్ల సీలింగ్ విధించినప్పటికీ, మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించి ఆ సీలింగ్‌ను ఉల్లంఘించిందని ఆరోపించారు. బీజేపీ మొదట కుల గణనకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, బీసీల నుంచి వ్యతిరేకత రావడంతో 2026 సెప్టెంబర్ నుంచి కుల గణన చేపడతామని ప్రకటించిందని వెంకట్రాములు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ చట్టాన్ని కేంద్రానికి పంపి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి అవసరమైన ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు: గడిచిన 10 ఏళ్లలో కేసీఆర్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34% నుండి 23%కి తగ్గించి బీసీలకు ద్రోహం చేసిందని విమర్శించారు. బీసీలకు వారి వాటా దక్కేంతవరకు ఈ మూడు పార్టీలను వదిలిపెట్టబోమని వామపక్ష నాయకులు స్పష్టం చేశారు. ఆగస్టు 12న వరంగల్ రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు వామపక్షాలు, బీసీ సంఘాలు కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోరుగడ్డ వరంగల్ నుంచే ఐక్య ఉద్యమాన్ని ప్రారంభించి, రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ (యు), న్యూ డెమోక్రసీ, సీపీఐఎంఎల్ లిబరేషన్, మానవ హక్కుల వేదిక, జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక, ఇంటలెక్చువల్ ఫోరంల నాయకులు పాల్గొన్నారు. వారిలో మేకల రవి, పనాస ప్రసాద్, ఈసంపల్లి బాబు, మాలోతు సాగర్, గంగుల దయాకర్, బండి కోటేశ్వర్, అక్కెనపల్లి యాదగిరి, డా. చందా మల్లయ్య, కె. వీరస్వామి, కేడెల ప్రసాద్, డా. చింతం ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## జిల్లా యోగ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా బొలిశెట్టి కమలాకర్ ఏకగ్రీవం**
**ప్రధాన కార్యదర్శిగా పాకాల కృష్ణవేణి**

**వరంగల్ వాయిస్, వరంగల్:** జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగసాయిపేటలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రాబోయే నాలుగు సంవత్సరాల కాలానికి పనిచేస్తుంది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, అధ్యక్షుడిగా బొలిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా పాకాల కృష్ణవేణి, కోశాధికారిగా అడుప సాంబశివరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ సభ్యులు కె. రజిత, టి. శ్రీనివాస్, ఎం.డి. పాషా, ఎ. జ్యోతి, మౌనిక, కడారి మహేష్, కుండే కిరణ్, బొలిశెట్టి చైతన్య, పాకాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





## వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**కుడా చైర్మన్ నివాసంలో పొంగులేటి సమీక్ష**



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, అందుకు అనుగుణంగా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు కలిసి పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్-చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వరంగల్ నగర అభివృద్ధిపై చర్చించేందుకు పలువురు నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శ, బరీష్, సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పేయి తదితరులు పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే వంటి కీలక అంశాలపై చర్చించారు.

# జైన రమేష్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు జైన రమేష్‌కు ఎడ్యుకేషన్, సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి, అమెరికాలోని గుడ్ న్యూస్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ (న్యూయార్క్, టెక్సాస్) అనుబంధ సంస్థ అయిన గాడ్ సన్ హోలీ థియలాజికల్ యూనివర్సిటీ ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది.జూన్ నెలలోనే ఈ గౌరవ డాక్టరేట్‌కు జైన రమేష్ ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ ప్రఖ్యాత వేడుకల మందిరంలో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది. సినీ, టీవీ ప్రముఖులు సంధ్యా జనక్, జబర్దస్త్ నటుడు అప్పారావు, రాజేందర్, మేకల శివ కుమార్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ డానియల్ కార్తికేయన్, అధ్యక్షులు డాక్టర్ అడ్రైన్ నజేరా చేతుల మీదుగా రమేష్‌కు ఈ డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా జైన రమేష్ మాట్లాడుతూ "ఈ గౌరవ డాక్టరేట్ పొందడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ పురస్కారం నాపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ఇది ప్రోత్సాహాన్ని ఇస్తుందని" అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, ప్రోత్సహించిన పెద్దలకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, లయన్స్ సభ్యులకు, ఆర్యవైశ్య బంధువులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా సామూహిక కుంకుమార్చన

**శ్రావణమాస ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు**



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీ సీతమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల అనంతరం, మహిళలు వాయనం ఇచ్చుకుంటూ, వడి నింపే కార్యక్రమాన్ని జరుపుకున్నారు. తమ ఇళ్లలో సిరిసంపదలు, సౌభాగ్యం కలగాలని ప్రతి సంవత్సరం శ్రావణ శుక్రవారం నాడు ఈ విధంగా పూజలు నిర్వహిస్తామని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపురం ఆర్యవైశ్య సంఘం మహిళలు, ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర భక్తులు పాల్గొన్నారు.

## శాయంపేటలో రక్షాబంధన్ వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) ఆధ్వర్యంలో శాయంపేట మండలంలో రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం, నవోదయ స్కూల్, వివేకానంద స్కూల్ మరియు ప్రధాన కూడలిలో ఈ వేడుకలు నిర్వహించారు. నవోదయ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఖండ వ్యవస్థ సహ ప్రమోక్ గిద్దెమారి సురేష్, నవోదయ స్కూల్ కరస్పాండెంట్ పృథ్వీ పాల్గొన్నారు. రక్షాబంధన్ భారతదేశ సంస్కృతికి ప్రతీక అని, ఇది అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 3000 రాఖీలు కట్టించారు. ఈ కార్యక్రమంలో ఉప మండల ప్రముఖ్ ఆనకారి శివాజీ, బాసని సాయి తేజ్, ములుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి



**వరంగల్ వాయిస్, నడికూడ:** కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం రోజున బీజేపీ మహా సంపర్క్ అభియాన్లో భాగంగా, పరకాల నియోజకవర్గం నడికూడ మండల అధ్యక్షుడు ఏరుకల దివాకర్ ఆధ్వర్యంలో చర్లపల్లి గ్రామంలో "ఇంటింటికి బీజేపీ, ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ, బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలు, డోర్ స్టిక్కర్లు పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గోగుల రాజిరెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జ్ మోతె మధుసూదన్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి తిప్పరపు సుధీర్, మండల ఉపాధ్యక్షులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** శ్రావణ శుక్రవారం సందర్భంగా హసన్‌పర్తి పాత మార్కెట్ వద్ద ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు సుమనాచార్యులు వేద మంత్రాల మధ్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరలక్ష్మి వ్రతం విశిష్టతను తెలిపే చారుమతి కథను భక్తులకు వినిపించారు. అనంతరం అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ మాట్లాడుతూ శ్రావణమాసం హిందువులకు అత్యంత పవిత్రమైన మాసమని చెప్పారు. ఆలయంలో గత 17 సంవత్సరాలుగా వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదిస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శేషవేణి, చకిలం సులోచన, సంద్రు నిరోష, గంట విజయ, తోట స్వప్న, గుండమీది విజయ, చల్ల లత, తోట వసంత, కొండమీది స్వరూప, స్రవంతి, రాపోలు ఉప్పలమ్మ, ముత్యల నాగరాణి, తలకొక్కుల రాజకుమారి, గౌరిశెట్టి రాజేశ్వరి, తోట అరుణ, ఉప్పుల సుగుణ, తోట సక్కుబాయి, పెరుమండ్ల స్వప్న, దోనేపాటి కళ్యాణి, కల్పదాసు ధనలక్ష్మి, అనగం పద్మావతి, మౌటం రమాదేవి, పాపిశెట్టి విశ్వశ్రీ, నన్నెంశెట్టి అనూష, నన్నెంశెట్టి స్వరూప, తిప్పారపు స్వర్ణలత, వనమ్మ, మహిళా భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

# జన్ను మల్లయ్యకు 'చల్లా' నివాళి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన, ఉమ్మడి ఆత్మకూరు మండలంలో రెండుసార్లు ఎంపీపీగా పనిచేసిన జన్ను మల్లయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. శుక్రవారం నాడు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం, ధర్మారెడ్డి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మాజీ గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ విద్యాసాగర్, గ్రామ అధ్యక్షుడు సునీల్ రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో మహేష్ మృతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ఆర్డీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కె. మహేష్ తన స్వగ్రామమైన కమలాపూర్ మండలం గూడూరులో గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. విధి నిర్వహణ అనంతరం ఇంటికి వెళ్లిన ఆయనకు ఈ దుర్ఘటన జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పరకాల ఆర్డీఓ కె.నారాయణ, కార్యాలయ సిబ్బంది ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా సమితి సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి ఆధ్వర్యంలో పోలీసులకు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులకు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా సుబేదారి పీఎస్, హనుమకొండ పీఎస్ ఎస్సైలకు రాఖీలు కట్టారు. బొజ్జు జ్యోతి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన, సమానత్వం కోసం సోదరభావంతో ముందుకు సాగాలని అన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా జీవించడానికి రాఖీ పండుగ దోహదపడుతుందని ఆమె తెలిపారు. సమాజంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రజలకు, విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకురాలు దీప్తి పాల్గొన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం, మానవతా దృక్పథంతో ఓ బాధిత కుటుంబాన్ని ఆదుకుంది. ముస్లిం ఉద్యోగుల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో ఈ సంఘం ఏర్పడింది. ఇటీవల వరంగల్, దూపకుంట రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకులంలో ఔట్‌సోర్సింగ్ టీచర్‌గా పనిచేస్తున్న అజ్మీరా బేగం రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ముస్లిం ఉద్యోగుల సంఘం, ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాకుండా, మానవత్వంతో అజ్మీరా బేగం కుటుంబానికి రూ. 28 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో కేజేఎన్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు షఫీ హమ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, జనరల్ సెక్రటరీ మాషిబ్, డిప్యూటీ తహసీల్దార్ అబ్బాస్ పాల్గొన్నారు.

# పండుగ రోజు కూడా పస్తులేనా?

**రామా రాజేష్ ఖన్నా**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జూలై నెల జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారీ జీతాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, పండుగలు వచ్చినా పస్తులుండే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన చెందుతున్నారు. సకాలంలో వేతనాలు: రాష్ట్రంలో 33 జిల్లాల్లో సుమారు 17,541 మందికి పైగా ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ, వారికి ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. జీవో నెం. 60 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు రూ. 15,600 వేతనం చెల్లించాలని అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించినా, పాత జీతాలే కొనసాగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులైన సపోర్టింగ్ స్టాఫ్, ఎం.ఎన్.ఓ., వాచ్‌మెన్, స్వీపర్లకు ప్రత్యేక నిధులు విడుదల చేసి, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, సెప్టెంబర్ మొదటి వారంలో కొత్త వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే, సెప్టెంబర్ 3 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని హెచ్చరించారు.

# కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రణవ్ బాబు చొరవతో కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరలో పంపిణీ చేయనున్నారు. ఈ విషయంపై కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి–రవీందర్ హనుమకొండలో ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. కమలాపూర్ మండలంలోని గూడూరు, మర్రిపల్లిగూడెం, కమలాపూర్‌లలో ఉన్న 450 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన శానిటేషన్, ఎలక్ట్రికల్ పనులను త్వరగా పూర్తి చేసి అర్హులకు అందించాలని వారు మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వెంటనే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విష్ణుదాసు వంశీధర్ రావు పాల్గొన్నారు.

# ఘనంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి వివాహ వార్షికోత్సవం

**◆ సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు**



**వరంగల్ వాయిస్, పాలకుర్తి:** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి హనుమాండ్ల ఝాన్సీ మరియు ప్రముఖ అంతర్జాతీయ హృద్రోగ నిపుణుడు డాక్టర్ హనుమాండ్ల రాజేందర్ రెడ్డిల 43వ వివాహ వార్షికోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పాలకుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున హాజరైన నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, యువజన నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలకుర్తి ప్రజలు తనకు ఇచ్చిన ప్రేమ, విశ్వాసం తన రాజకీయ ప్రయాణానికి బలాన్ని ఇచ్చాయని ఝాన్సీ రెడ్డి అన్నారు. వారి అభివృద్ధి కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాలకుర్తి ప్రజల ఆప్యాయత, ఆదరణ తమకు గర్వకారణమని డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా సేవలో మరింత శ్రద్ధ పెట్టి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఝాన్సీ రెడ్డి – డా. రాజేందర్ రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వాదం పొందారు. వారి కుమారుడు రాజా రామ్మోహన్ రెడ్డి కూడా ఈ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, తాము రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం గెస్ట్ హౌస్ (సత్రం) నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ నిర్మాణాన్ని పూర్తిగా తమ సొంత నిధులతో చేపడతామని వారు తెలిపారు. భక్తులు, యాత్రికులకు విశ్రాంతి, వసతి కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని వారు వివరించారు. భూమిపూజ అనంతరం మీడియాతో మాట్లాడిన దంపతులు, పాలకుర్తి ప్రజల ప్రేమ, విశ్వాసం మరువలేనివని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పాలకుర్తి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళా నేతలు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### హీరోల ఎంట్రీపై ఉత్కంఠ కలిగించేలా మేకింగ్

ఎన్టీఆర్ వార్-2. రజనీకాంత్ కూలీ చిత్రాలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండూపోటీగా విడుదలవుతున్నాయి. సినిమా స్టార్ కాగానే హీరో కనిపించే విధానానికి చెక్ పెట్టేస్తున్నారు మేకర్స్. గతంలో ఓ స్పెషల్ సాంగ్ లేదా ఓ చిన్న ఎలివేషన్లతో హీరో ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మినిమం అరగంట గ్యాప్ ఉండాల్సిందే. ఈ మధ్య సలార్, కల్కిలో అరగంట తర్వాతే యంగ్ రెబల్ స్టార్ దర్శన భాగ్యం లభించింది.. జస్ట్ కటౌట్ కనిపిస్తే చాలు అనుకుంటున్న ఫ్యాన్స్. ఈ గ్యాప్ పెద్దగా లెక్క చేయడం లేదు. ఇప్పుడు కూలీ, వార్ 2లో రజనీకాంత్, జూనియర్ ఎంట్రీ– కూడా ఇలాగే ప్లాన్ చేసినట్లు– టాక్ నడుస్తోంది. కూలీలో రజనీకాంత్ స్క్రీన్ పై కనిపించేంది మూవీ స్టార్ట్ అయిన గంట తర్వాత అన్నది బజ్ నడుస్తోంది. ఈ గంటలోనే మిగిలిన క్యారెక్టర్లన్నింటినీ చూపించబోతున్నాడట లోకేశ్ కనగరాజ్. అటు– బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమౌతున్న తారక్ కూడా –టైటిల్ కార్డ్స్ పడిన అరగంట తర్వాతే కనిపించబోతున్నాడట. వార్ 2లో హృతిక్– తారక్ ఫేస్ ఆఫ్ అండ్ సాంగ్ స్క్రీన్ తగలబడిపోతాయంటున్నారు బాలీవుడ్ క్రిటిక్స్. రెండూ తెలుగు సినిమాలు కాదు కానీ అలా అని పొరుగు సినిమాలనీ తీసేయలేం. ఎందుకంటే ఇద్దరు టాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్ హీరోలు నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాల్లో భాగం కాబోతున్నారు. సో మన సినిమాలుగా రిసీవ్ చేసుకుంటున్నారు టాలీవుడ్ ఆడియన్స్.

## కూలీ Vs వార్-2




# కాంతారా నుంచి కనకవతి

కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. 2022లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా వస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఈ సినిమాలో నటిస్తున్న కథానాయక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేశారు మేకర్స్. రుక్మిణి వసంత్ ఇందులో కనకవతిగా కనిపించబోతున్నట్లు– ప్రకటించారు. ంబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు– తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.









# లారెన్స్ బ్రదర్స్ బుల్లెట్ బండి







ట్యాలెంట్ పవర్‌హౌస్‌గా పేరుగాంచిన రాఘవ లారెన్స్, ఆయన తమ్ముడు ఎల్విన్ కలిసి లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'బుల్లెట్టు– బండి'. మిస్టరీ, క్రైమ్, యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి తమిళ చిత్రం డైరీ ఫేం దర్శకుడు ఇన్నాసి పాండియన్ దర్శకత్వం వహించారు. తాజాగా సినిమా మేకర్స్ శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే మొదటి షాట్ నుంచే కథలోకి లాగేసే రీతిలో కట్ చేయబడిరది. . గతేడాది 'జిగర్తాండా డబుల్ ఎక్స్' సినిమాతో మంచి విజయాన్ని సాధించిన లారెన్స్, ఈ చిత్రంతో కూడా హిట్ కొట్టడం ఖాయమనే హైప్ క్రియేట్ అయ్యింది. మరో విశేషం ఏమిటంటే, రియల్ స్టార్, స్వర్గీయ శ్రీహరి భార్య డిస్కో శాంతి ఈ మూవీతో చాలాకాలం తర్వాత రీ–ఎంట్రీ– ఇస్తున్నారు. అలాగే టాలీవుడ్ కమెడియన్ సునీల్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు,

# విడుదలకు సిద్ధమవుతున్న అఖండ-2

నందమూరి నటసింహం బాలకృష్ణ– మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2' పై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సింహ, లెజెండ్, అఖండ వంటి ఘన విజయాల తర్వాత ఈ జోడీ మరోసారి స్క్రీన్ మీద అదరగొట్టేందుకు సిద్ధమవుతోంది. అఖండ 2 చిత్రం 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'అఖండ' కు సీక్వెల్ కావడం విశేషం. ఆ చిత్రంలో బాలయ్య పోషించిన ఆఘోర పాత్ర, బోయపాటి మాస్ మేకింగ్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఆ ఫార్ములాను మరింత పవర్‌ఫుల్‌గా స్క్రీన్ మీదకి తీసుకురావాలని బోయపాటి తెగ కష్టపడుతున్నారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో ప్రగ్యా జైశ్వాల్, సంజయ్ దత్, ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్, జగపతిబాబు, హర్షాలీ మల్హోత్రా వంటి తారాగణం కనిపించనున్నారు.

# అన్నీ తానై..

- 40 ఏళ్ల కల నెరవేర్చిన నాయిని
- ప్రశంసలు కురిపిస్తున్న లబ్ధిదారులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 30 డివిజన్ బాలసముద్రంలో నిర్మించిన రెండు పడకల ఇండ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా సాగింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. దీంతో 40 ఏళ్ల కల నెరవేరిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.3,904 లక్షల వ్యయంతో 37 బ్లాకులు జీ ప్లస్ త్రీ చొప్పున మొత్తం 592 డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణాన్ని 2015లో ప్రారంభించి 2019లో పూర్తి చేశారు. అయితే వీటిని లబ్ధిదారులకు కేటాయిస్తే పార్టీలో గొడవలు జరుగుతాయని భావించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో గత ఆరు ఏళ్లుగా అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల పక్షాణ నిలిచిన స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నీ తానై అందరితో మాట్లాడి, ప్రభుత్వాన్ని ఒప్పించి కేటాయింపులకు ముహూర్తం ఫిక్స్ చేయడంలో విజయం సాధించారు. తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్, జితేందర్ నగర్ కాలనీలలో నిర్మించిన రెండు పడకల ఇళ్లలో వికలాంగులకు కేటాయించిన ఇళ్లకు కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేశారు. నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఇళ్ల ఆవరణలో మొక్కలు నాటి లబ్ధిదారులకు పట్టు వస్త్రాలను అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో 592 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు.

### కోట్లు దండుకున్నారు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం జరిపించినప్పటికీ సుమారు 500 మంది లబ్ధిదారులను నానా ఇబ్బందులు గురి చేసిన మాట వాస్తవం అన్నారు. గత పాలకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పేద ప్రజలను ఆయుధంగా వాడుకున్నారని దుయ్యబట్టారు. ప్రతి బీఆర్ఎస్ నాయకుడు ఇంటిని కేటాయిస్తామని చెప్పి కోట్లు దండుకొన్నారని ఆరోపించారు. కానీ నేడు నాకు ఎటువంటి ఓటు బ్యాంకు అవసరం లేకుండా చరిత్రలో నిలిచిపోయేలా పట్టాలను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. మేము బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అని చూడకుండా కేవలం అర్హతే కొలమానంగా అర్హులను ఎంపిక చేశామన్నారు. ఎవరి నుంచి డబ్బులు ఆశించలేదన్నారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పూర్తి పారదర్శకంగా..

నిష్పక్షపాతంగా, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 277, ఎస్టీలు 40, బీసీలు 235, మైనార్టీలు 31, ఓసీ తొమ్మది మొత్తం 592 కుటుంబాలకు ఇంటి ప్రవేశ పత్రాలు అందజేసినట్లు నాయిని తెలిపారు. బ్లాకుల వారీగా తాగునీరు, విద్యుత్, శానిటేషన్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారికి న్యూశాయంపేటలోని రెండు పడక ఇళ్లను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి పశ్చిమ నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని నాయిని రాజేందర్ రెడ్డి కోరారు.

### చుక్కలు చూపిస్తా..

గతంలో డబుల్ బెడ్ రూమ్ లు ఇప్పిస్తామంటూ మాయ మాటలు చెప్పి లక్షలు దండుకున్న దళారుల వివరాలు వెల్లడిస్తే నోట్ల కట్టలు కక్కిస్తానంటూ ప్రకటించారు. ఇక నుంచి వారికి చుక్కలు చూపిస్తానన్నారు. విపక్షాల కుట్రలను తిప్పికొడుతానన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు ఇస్తామంటే నమ్మి మీరు ఎవరెవరికి డబ్బులు ఇచ్చారో నాకు చెప్పండి అంటూ నాయిని కోరారు. ఆరు వందల ఇండ్లు ఉంటే 1500 మంది నుంచి డబ్బులు దండుకున్న ఘనత వారిదే అంటూ దుయ్యబట్టారు. డబుల్ బెడ్ రూమ్ లకోసం గుడిసె వాసులు వందల సార్లు ఆందోళన చేసినా ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇండ్లు కేటాయిస్తే వారి బండారం బయట పడుతుందన్న భయంతోనే పెండింగ్ లో పెట్టారన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక అందరితో చర్చించి 165మంది గుడిసెవాసులతోపాటు నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించామన్నారు.

### నెరవేరిన కల..

నిరుపేదల సొంతిటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాదేవుడు నాయిని అంటూ ప్రశంశలు కురిపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పూరి గుడిసెల్లో జీవిస్తున్న మా కుటుంబాల్లో నాయిని రాజేందర్ రెడ్డి వెలుగులు నింపారని కొనియాడారు. ఎలాంటి ప్రలోభాలకు ఆశపడకుండా నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జంధ్యాల పౌర్ణమి అంటే ఏమిటి? ఆ పండుగ ఎలా జరుపుకుంటారో తెలుసా ?

శ్రావణ పూర్ణిమను జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. యజ్ఞోపవీతం ధరించేవారంతా ఈ రోజున నూతన యజ్ఞోపవీత ధారణ చేసి , జప , అర్చనాదులను నిర్వహిస్తుంటారు. యజ్ఞోపవీతము అనే పదము 'యజ్ఞము' 'ఉపవీతము' అనే రెండు పదాల కలయికవల్ల ఏర్పడింది. యజ్ఞము అంటే 'యాగము' 'ఉపవీతము' అంటే దారము అనే అర్థాలున్నాయి. యజ్ఞోపవీతము అంటే యాగకర్మ చేత పునీతమైన దారము అని అర్థము. యజ్ఞోపవీతం సాక్షాత్తూ గాయత్రీదేవికి ప్రతీక. పరమ పవిత్రమైన యజ్ఞోపవీత ధారణవల్ల జ్ఞానాభివృద్ధి కలుగుతుందని, యజ్ఞం ఆచరించిన ఫలితం కలుగుతుందని వేదోక్తి. యజ్ఞోపవీతాన్నే జంధ్యమని, బ్రహ్మసూత్రమని పిలుస్తారు.
ఏడాదికి వచ్చే ద్వాదశ పౌర్ణమిల్లో శ్రావణ పౌర్ణమికి చాలా విశిష్టత ఉంది. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు. దీనినే ఉపాకర్మ అంటారు. ఉపాకర్మను యజ్ఞోపవీతం పేరుతో పిలుస్తారు. దీనికి అంటే యాగ కర్మతో పునీతమైన దారం అని అర్థం. పాల్కురికి సోమనాథుడు దీనిని నూలి పౌర్ణమి అన్నాడు. ఎందుకంటే నూలుతో తయారుచేసిన జంధ్యాన్ని ధరించడమే దీనికి కారణం. వేద్యాధ్యయనానికి ప్రతీకైన ఉపాకర్మను ఆచరించాలి. దీనికి ముందు ఉపనయనం జరిపించి జంధ్యాన్ని వేయడం ఆచారం.
యజ్ఞోపవీతం ధరించినవారు ద్విజులు. ద్విజులు అంటే రెండు జన్మలు కలవారని అర్థం. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటిది కాగా, ఉపనయనం అనంతరం గురువు నుంచి జ్ఞానాన్ని పొందడం రెండోది. ఉపనయం సమయంలో యజ్ఞోపవీతానికి జింక చర్మాన్ని కడతారు. దీనిని ఉపాకర్మ కార్యక్రమంలో శ్రావణ పౌర్ణమి నాడు వదిలిపెడతారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజు గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించి పాతది విసర్జించాలి. పరిపక్వతకు, పరిశుద్ధతకు యజ్ఞోపవీతం దివ్యౌషధం. ఇది ఉపనయన సంస్కారం ఉన్నవారికే పరిమితమైనా మిగతావారు కూడా అష్టోత్తరాలతో గాయత్రీదేవిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి. అవివాహితులు మూడు పోగుల జంధ్యాన్ని, వివాహమైన వారు మూడు ముడులున్న తొమ్మిది పోగుల జంధ్యాన్ని ధరిస్తారు.



**రాంపెల్లి లింగమూర్తి నేత**
అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జ్



# ఘనంగా గడ్డం రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రెస్ క్లబ్ లో నిర్వహణ
- హాజరైన ప్రెస్ క్లబ్ బాధ్యులు, సీనియర్ జర్నలిస్టులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, సాక్షి దినపత్రిక ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్, సీనియర్ పాత్రికేయుడు గడ్డం రాజిరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి రాజిరెడ్డికి తినిపించారు. ఆయనను శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, సాక్షి ఎడిషన్ ఇంచార్జి వర్ధెల్లి లింగయ్య, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు తోట సుధాకర్, సాయిరాం, బొడిగె శ్రీను, నరేష్, పొడిచెట్టి విష్ణువర్ధన్, రవీందర్, రాజ్ కుమార్, పొగాకుల అశోక్, ప్రశాంత్, నాగరాజు, ప్రశాంత్, సోమనర్సయ్య, భరత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటాలి..

- పర్యావరణాన్ని పరిరక్షించాలి
- మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఆర్పీలకు మొక్కల అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రతి ఇంటి ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్ లో మెప్మాకు చెందిన ఆర్పీలకు మొక్కల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని మైదాన ప్రాంతాలు, ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటడమే కాకుండా ఇండ్లలో కూడా మొక్కలు నాటాలని కోరారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కోరిన మేరకు ఔషధ, పండ్ల మొక్కలను అందజేయాలన్నారు. సోమవారం నుంచి ప్రతి వార్డులో కార్యక్రమాలు ఏర్పాటు చేసి మొక్కలను అందజేయాలన్నారు. ప్రతి ఇంటికి మొక్కలను అందజేసే కార్యక్రమంలో ఆర్పీలు ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ స్థానిక కార్పొరేటర్ సహకారంతో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోన, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఓ రమేష్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, టీఎంసీ రమేష్, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com